TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

జాతీయ తెలుగు దిన పత్రిక

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISH IN TELANGANA సంపుటి : 1 సంచిక: 17 10-6-2025 మంగళవారం పేజీలు : 4 వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, M Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagir

## సీఎం రేవంత్ కు మంత్రి అడ్లూరి కృతజ్ఞతలు



హైదరాబాద్,(సందేశం టైమ్స్): తెలంగాణ రాష్ట్రం మంత్రివర్గంలో చోటు కల్పించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు. సోమవారం సీఎం కలిసి పుష్ప గుచ్ఛం అందించి తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని తెలియజేశారు. మాదిగ సామాజిక వర్గానికి మంత్రివర్గంలో చోటు కల్పించారని, ప్రాణం ఉన్నంతవరకు కాంగ్రెస్ పార్టీకి రుణపడి ఉంటానని తెలిపారు.

## మహిళలకు రూ.182 కోట్ల జీరో టిక్కెట్లు: మల్లు భట్టివిక్రమార్క



(సందేశం టైమ్స్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచితంగా బస్సులో ప్రయాణించే అవకాశం కల్పిస్తోంది. ఈ పథకం నవంబర్ 2023లో ప్రారంభమైంది, ఇప్పటి వరకు పెద్ద ఎత్తున మహిళలు లబ్ధి పొందుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం విజయవంతంగా కొనసాగుతోందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు రూ. 182 కోట్ల విలువైన జీరో టికెట్లను జారీ చేసినట్లు ఆయన వెల్లడించారు. సోమవారం సూర్యాపేట ఆర్టీసీ డిపోలో కొత్తగా ప్రవేశపెట్టిన ఎలక్ట్రిక్ బస్సులను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భట్టి విక్రమార్క ప్రసంగించారు.

ఆర్టీసీకి నిధుల మద్దతు

మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు అందిస్తున్న ఉచిత ప్రయాణ సేవలకు సంబంధించి కొందరు వ్యక్తం చేసిన ఆందోళనలు అవాస్తవమని ఉపముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మహిళలు ఉచితంగా ప్రయాణించినప్పటికీ, ఆ మొత్తాన్ని ప్రభుత్వం ఆర్టీసీకి క్రమం తప్పకుండా చెల్లిస్తోందని ఆయన తెలిపారు. ఇప్పటివరకు ఈ పథకం కింద తెలంగాణ ఆర్టీసీకి రాష్ట్ర ప్రభుత్వం రూ. 6,088 కోట్లు చెల్లించిందని వివరించారు.ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం వల్ల ఆర్టీసీ బస్సులు పూర్తి సామర్థ్యంతో నడుస్తున్నాయి. దీనివల్ల సంస్థ ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఎంతగానో దోహదపడుతోంది" అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## బస్ పాస్ ఛార్జీలు పెంచిన ఆర్టీసీ




హైదరాబాద్,(సందేశం టైమ్స్) : రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రకాల బస్‌పాస్ ఛార్జీలు పెరిగాయి. సాధారణ ప్రజలతో పాటు స్టూడెంట్ బస్ పాస్ ధరలను కూడా టీజీఆర్‌టీసీ పెంచింది. పెంచిన బస్ పాస్ ధరలు తక్షణం అమల్లోకి రానున్నాయి. 20 శాతానికి పైగా బస్ పాస్ రేట్లు పెరిగాయి. రూ. 1150 ఉన్న ఆర్డినరీ పాస్ ధర రూ. 1400కు పెంపు, రూ. 1300 ఉన్న మెట్రో ఎక్స్‌ప్రెస్ పాస్ రూ. 1600, రూ. 1450 ఉన్న మెట్రో డీలక్స్ పాస్ రూ. 1800కు పెంచారు. మిగతా 2లో...

## ప్రతీ ఇంటికి సరిపడా నీరందిస్తాం : బండి సంజయ్





2 లో

చొప్పదండి,(సందేశం టైమ్స్) : ప్రతీ ఇంటికి.. ప్రతీ వ్యక్తికి సరిపడా నీరందించే దిశగా అమృత్- 2 పథకాన్ని అమలు చేస్తున్నామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి పట్టణంలోని నల్లాల బావి వద్ద రూ.36.3కోట్ల వ్యయంతో వాటర్ ఇంప్రూవ్ మెంట్ స్కీంకు కేంద్ర మంత్రి బండి సంజయ్ శంకుస్థాపన చేశారు.ఈసందర్భంగా మీడియాతో మాట్లాడుతూ చొప్పదండి మున్సిపాలిటీలో ప్రతి ఒక్కరికీ సరిపడా నీళ్లను అందించాలనే లక్ష్యంతో అమృత్ 2 పథకం కింద 36కోట్ల 30లక్షల రూపాయల నిధులతో పైప్ లైన్, వాటర్ సంప్ ఇతర పనులను చేపట్టేందుకు పనులను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. 2015 జూన్ 25న ప్రారంభమైన అమృత్ 1 పథకం కింద 2015-16 నుండి 2019-20 వరకు కేంద్ర ప్రభుత్వం తన వాటా కింద ఖర్చు 50 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిందన్నారు. అమృత్ స్కీం ద్వారా దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు 1 కోటి 34 లక్షల నీటి కనెక్షన్లు అందించామన్నారు. 1 కోటి 2 లక్షల మురుగునీటి కనెక్షన్లు అందించామన్నారు. వీటితో పాటు 2 వేల 411 పార్కులను అభివృద్ధి చేశామని, 62 లక్షల 78 వేల ఎల్ఈడీ లైట్లను అమర్చామన్నారు.

## కాళేశ్వరం కమిషన్ 20 ప్రశ్నలు..

## ప్రతి ప్రశ్నకు ఆధారాలతో సహా వివరించిన హరీశ్‌రావు



2 లో

హైదరాబాద్,(సందేశం టైమ్స్): కాళేశ్వరం కమిషన్ ముందు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విచారణ ముగిసింది. 40 నిమిషాల పాటు కొనసాగిన విచారణలో కమిషన్ చైర్మన్ పీసీ ఘోష్ అడిగిన అన్ని ప్రశ్నలకు హరీశ్‌రావు సమాధానం ఇచ్చారు. మొత్తం 20 ప్రశ్నలు అడగ్గా.. ప్రతి ప్రశ్నకు హరీశ్‌రావు ఆధారాలు సమర్పిస్తూ సమాధానం ఇచ్చారు. ప్రధానంగా కాళేశ్వరం కార్పొరేషన్, డిజైన్ల మార్పుపై కమిషన్ హరీశ్‌రావును ప్రశ్నించింది. బ్యారేజీలలో నీళ్లను నింపడం, డిజైన్లు తయారీపై కమిషన్ ప్రశ్నించింది. మహారాష్ట్ర ఒప్పుకోలేదు కాబట్టే మేడిగడ్డ నిర్మాణం జరిగిందని హరీశ్‌రావు తెలిపారు. కమిషన్ ముందు కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్‌ను హరీశ్‌రావు చూపించారు. కమిషన్ ముందు జీవోలు, డాక్యుమెంట్ ఆధారంగా సమాధానాలు చెప్పిన హరీష్ రావు. ఇరిగేషన్ మంత్రిగా ఎన్ని రోజులు పనిచేశానని హరీశ్‌రావును కమిషన్ ప్రశ్నించింది.

## అశ్రునయనాల మధ్య మైలారపు అడెల్లు అంతిమ వీడ్కోలు



ఉమ్మడి ఆదిలాబాద్,(సందేశం టైమ్స్) : చత్తీస్ ఘడ్ నేషనల్ పార్క్ ఏరియాలో ఎన్ కౌంటర్ లో మృతిచెందిన మావోయిస్టు అగ్రనేత మైలారపు అడెల్లు అలియాస్ భాస్కర్ అంత్యక్రియలు సోమవారం ఆదిలాబాద్ జిల్లా పొచ్చెర లో జరిగాయి. 35ఏళ్ల సాయుధ బాట అనంతరం పోలీసుల కాల్పుల్లో నేలకొరిగిన అడెల్లు మృతదేహాన్ని కడసారి చూసేందుకు వివిధ ప్రాంతాల నుండి వేలాది మంది హాజరై నివాళులర్పించారు. పీడిత వర్గాల కోసం మూడున్నర దశాబ్దాల కిందట అడవి బాట పట్టి రగల్ జెండాతో ఉద్యమంలో ఉన్నత స్థాయికి ఎదిగిన అడెల్లు అలియాస్ భాస్కర్ విగతజీవిగా ఇంటికి తిరిగి రావడంపై గ్రామస్తులు కన్నీరు మున్నీరుగా విలపించారు. కుటుంబ సభ్యుల రోధనలకు అంతులేకుండా పోయింది. అరుణోదయ తార అడెల్లు నింగికేగడం ఊహించలేకపోయామని మావోయిస్టు బంధుమిత్రుల కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఎర్ర జెండాలు చేత పట్టుకుని, మైలారపు అడెల్లు అమర్ హై అంటూ వేలాదిమంది దారి పొడుగునా నినదించారు.

కగార్ ఆపరేషన్ ఆపివేయాల్సిందే..

బూటకపు ఎన్ కౌంటర్ల పేరిట బహుజన విప్లవకారులను అంతమొందించడానికే కగార్ ఆపరేషన్ నిర్వహిస్తున్నారని బోత్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. అడెల్లు భౌతిక కాయాన్ని సందర్శించి ఎమ్మెల్యే నివాళులర్పించారు. వారి కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించి ఓదార్చారు. తెలంగాణ మావోయిస్ట్ ఉద్యమకారులను మట్టు పెట్టడమే లక్ష్యంగా సాగుతున్న కగార్ ఆపరేషన్ నిలిపివేసి శాంతి చర్చలు జరపాలని విప్లవ రచయితల సంఘం,

2 లో

## సీఎంను కలిసిన మంత్రి వాకిటి శ్రీహరి



మక్తల్,(సందేశం టైమ్స్): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని రాష్ట్ర మంత్రి మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి కుటుంబ సమేతంగా కలుసుకున్నారు. రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఇవాళ ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో ముఖ్యమంత్రిని ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిగా మీ నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి కోసం పని చేస్తానన్నారు.

## ప్రభాకర్ రావు మామూలోడు కాదు : బండి సంజయ్



కరీంనగర్,(సందేశం టైమ్స్): ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు మామూలోడు కాదని కేంద్ర హోంశాఖ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ ప్రభాకర్ రావు మాలాంటి అనేక మంది కార్యకర్తల ఉసురుపోసుకు న్నాడన్నారు. అమెరికాలోనే ప్రభాకర్ రావుకు కేసీఆర్ కుటుంబంతో కౌన్సెలింగ్ తంతు పూర్తయ్యిందని, పథకం ప్రకారమే లొంగిపోయి విచారణకు హాజరయ్యారన్నారు. విచారణలో ప్రభాకర్ రావు ఇచ్చిన స్టేట్ మెంట్ ను బహిరంగ పర్చాలని, ఎందుకంటే సీఎం రేవంత్ రెడ్డిపైనే కాదు.. తనతో పాటు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నేతలు, జడ్జీల ఫోన్లను కూడా ట్యాప్ చేసిన ఘనుడు అన్నారు. ప్రభాకర్ రావు వల్ల అనేక మంది జీవితాలు నాశనమయ్యాయని, ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. భార్యాభర్తలు మాట్లాడుకున్న సంభాషణలను కూడా ట్యాప్ చేసిన నీచుడని, ఆయన వల్ల భార్యాభర్తలు ఫోన్ లో మాట్లాడుకోలేని దుస్థితిని కల్పించారన్నారు. ఎవరి ఆదేశం మేరకు ఫోన్ ట్యాపింగ్ చేశారో ప్రజలకు తెలియాలన్నారు. ఫోన్ ట్యాపింగ్ చేశాక వాటిని ఏం చేశారు.. ట్యాపింగ్ ఆడియోలను ఎవరికి పంపారని, ఆ ఆడియోలను అడ్డుపెట్టుకుని ఎవరెవరిని బెదిరించారు..

మిగతా 2లో...

# ప్రతీ ఇంటికి సరిపడా నీరందిస్తాం : బండి సంజయ్

2021లో అమృత్ 2.0 పథకం ప్రారంభమై ఐదేళ్ల పాటు ఈ పథకం అమలులో ఉంటుందన్నారు. ఈ స్కీం కింద కేంద్ర, రాష్ట్రాలు, మున్సిపాలిటీల భాగస్వామ్యంతో ఈసారి 2 లక్షల 99 వేల కోట్ల రూపాయల ఖర్చు చేయాలని మోదీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఇందులో కేంద్ర వాటా కింద 76 వేల 760 కోట్ల రూపాయలను కేటాయించబోతున్నామని, మిగిలిన మొత్తాన్ని ఆయా రాష్ట్రాలు, నగర పాలక సంస్థలు సమీకరించుకోవాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో అమృత్ 1, అమృత్ 2.0 కింద మొత్తం 6 వేల 876 కోట్లు ఖర్చు చేయబోతున్నామని, కేంద్ర వాటా 3 వేల 591 కోట్ల 72 లక్షల రూపాయలు ఉండగా, రాష్ట్ర వాటా కింద 2 వేల 614 కోట్ల 82 లక్షల రూపాయలు ఉందన్నారు. ఎంపిక చేయబడిన మున్సిపాలిటీల వాటా 669 కోట్ల 85లక్షల రూపాయలు ఉండగా, అమృత్ 1 కింద 1153 కోట్లు, అమృత్ 2 కింద 2438 కోట్ల రూపాయలను మోదీ ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా విషయానికొస్తే అమృత్ 1, అమృత్ 2 కింద మొత్తం 852 కోట్ల 11 లక్షల రూపాయలు కేటాయించామన్నారు.

ఇందులో కేంద్ర వాటా 481 కోట్ల 19 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వ వాటా 297 కోట్ల 55 లక్షలు, మున్సిపాలిటీల వాటా 73 కోట్ల 37 లక్షలుగా ఉందన్నారు. చొప్పదండి మున్సిపాలిటీలో అమృత్ 2 కింద 36 కోట్ల 30 లక్షల రూపాయల నిధులతో ఇంటింటికీ నీళ్లు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇందులో కేంద్ర ప్రభుత్వం 17 కోట్ల 89 లక్షలు, రాష్ట్రం వాటా 15 కోట్ల 11 లక్షలు, మున్సిపాలిటీ వాటా 3 కోట్ల 30 లక్షలు ఉందన్నారు. దేశంలో 40 శాతం జనాభా పట్టణాల్లోనే నివసిస్తోందని, 2047 నాటికి ఈ సంఖ్య 50 శాతం కంటే ఎక్కువ కాబోతోందన్నారు. ప్రధాని మోదీ ఎంతో దూరదృష్టితో నగరాలు, పట్టణాల్లో నివసించే ప్రతి ఇంటికీ సరిపడా నీటిని అందించంతోపాటు డ్రైనేజీ సౌకర్యం కల్పించి నీటి భద్రతా నగరాలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో అమృత్ పథకాన్ని ప్రారంభించిందన్నారు.

చొప్పదండిలో ఎప్పుడో ఈ స్కీంను మొదలు పెట్టాల్సి ఉన్నా గత ప్రభుత్వం సం వాకరించక పోవడం వల్ల నిలిచి పోయిందన్నారు. అన్ని అడ్డంకులను అధిగమించి పథకం పనులకు శ్రీకారం చుట్టడం చాలా ఆనందంగా ఉందన్నారు. వచ్చే ఏడాది చివరి నాటికి ఈ పనులను పూర్తి చేసి చొప్పదండి ప్రజలకు ఇంటింటికీ సరిపడా నీళ్లు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. దీంతోపాటు సీఆర్ఎఫ్, ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రోడ్లను నిర్మిస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి అనేక అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభతో పాటు పలువురు పాల్గొన్నారు.

# బస్ పాస్ ఛార్జీలు పెంచిన ఆర్టీసీ

విద్యార్థులకు కొత్త బస్ పాస్‌లకు గ్రీన్ సిగ్నల్ రాష్ట్రంలో ఈ నెల 12న విద్యాసంస్థలు తెరవనున్న క్రమంలో విద్యార్థులకు కొత్తగా బస్సు పాస్‌లకు టీజీ ఆర్టీసీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో విద్యార్థులకు ఈ నెల 12 నుంచి కొత్త బస్ పాసుల ను జారీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లను చేస్తున్నారు. కొత్త బస్ పాస్ ల కోసం వెబ్ సైట్లో అప్లై చేసుకోవాలని అధికారులు సూచించారు. గ్రేటర్‌లో 40 కేంద్రాల ద్వారా పాస్‌లు నగర వ్యాప్తంగా 40 ఆర్టీసీ కేంద్రాల్లో విద్యార్థులు ఈ బస్ పాస్‌లను పొందవచ్చని ఆర్టీసీ యాజమాన్యం తెలిపింది. అనంతరం అప్లికేషన్ ఫామ్‌ను తీసుకెళ్లి విద్యార్థులకు దగ్గరలో ఉన్న బస్ పాస్ కౌంటర్లలో ఇస్తే.. స్టూడెంట్ బస్ పాస్ జారీ అందజేస్తారని.. ఆర్టీసీ అధికారులు తెలిపారు. మహాలక్ష్మి పథకం ఉన్నందున విద్యార్థినులు బస్ పాస్ తీసుకోవాల్సిన అవసరం లేకుండా పోయింది.

# సీఎంను కలిసిన మంత్రి వాకిటి శ్రీహరి

మంత్రివర్గంలో తనకు అవకాశం ఇచ్చినందుకు మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ముఖ్యమంత్రికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో మంత్రి సతీమణి లలితతో పాటు కుమారులున్నారు.

# ప్రభాకర్ రావు మామూలోడు కాదు : బండి సంజయ్

కోర్టు నిబంధనలకు లోబడే ప్రభాకర్ రావుపై సీరియస్ గా చర్యలు తీసుకోవాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లుతోందని, 18నెలల పాలనలో ఏ ఒక్క అవినీతి కేసులో విచారణ కూడా ముందుకు సాగలేదన్నారు. ఇకనైనా కోర్టులో గట్టిగా వాదనలు వినిపించాలని, ప్రభాకర్ రావుతో సహా ఆయన వెనుకున్న సూత్రధారులను దోషులుగా తేల్చాల్సిందేనన్నారు.

# అశ్రునయనాల మధ్య మైలారపు అడెల్లు అంతిమ వీడ్కోలు

పౌర హక్కుల సంఘం, మావోయిస్టు బంధుమిత్రుల కమిటీ ప్రజా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. అంతిమయాత్ర లో అరుణోదయ కళాకారులు డప్పు చప్పులతో విప్లవ గీతాలు ఆలపిస్తూ ముందుకు సాగారు. మూడు గంటల పాటు సాగిన అంతిమయాత్రలో సుమారు 3వేల మంది హాజరు కావడం గమనార్హం. అంతిమ యాత్రలో సికాస మాజీ సీఈవో సుధాకర్ అలియాస్ ఉషన్న, పౌర హక్కుల సంఘం నేతలు గడ్డం లక్ష్మణ్, నారాయణ కుమారస్వామి, తుడుం దెబ్బ నాయకులు గణేష్, రేణుక, మావోయిస్టు మాజీ ఉద్యమ నేతలు మురళి అజయ్ అశోక్ జ్యోతి, జయ, శ్రీకాంత్, విరసం నేత పాణి, సిపిఐ నాయకులు ప్రభాకర్ రెడ్డి, మావోయిస్టు బంధుమిత్రుల కమిటీ నేతలు పద్మకుమారి, శాంతక్క పాల్గొన్నారు.

# కాళేశ్వరం కమిషన్ 20 ప్రశ్నలు..
# ప్రతి ప్రశ్నకు ఆధారాలతో సహా వివరించిన హరీశ్‌రావు

కమిషన్ ప్రశ్నలు.. హరీశ్‌రావు సమాధానాలు ఇలా..

**కమిషన్**

జీవో 115 మంత్రుల సబ్ కమిటీ ఎందుకు ఏర్పాటు చేశారు?

మంత్రుల సబ్ కమిటీ ఏ అంశాలపై స్టడీ చేసింది?

**హరీశ్ రావు**

రైతులకు ఎక్కువ సంఖ్యలో నీళ్ల అందించడానికి అప్పటి ప్రభుత్వం సబ్ కమిటీ ఏర్పాటు చేసింది.

సబ్ కమిటీలు తుమ్మల నాగేశ్వరరావు ఈటల రాజేందర్ హరీష్ రావు ఉన్నారు.

సీడబ్ల్యూసీ, రిటైర్డ్ ఇంజనీర్ల సూచనల మేరకు మేడిగడ్డ నిర్మాణం జరిగింది.

మహారాష్ట్ర ఒప్పుకోలేదు కాబట్టి తుమ్మిడిహట్టి వద్ద నుంచి మేడిగడ్డకు మార్చాం.

16 లక్షల కంటే ఎక్కువ ఆయకట్టుకు నీళు ఇవ్వాలంటే రిజర్వాయర్ల సంఖ్య పెంచాలని చెప్పింది.

సీడబ్ల్యూసీ సూచనల మేరకే బ్యారేజీలు, రిజర్వాయర్ల సంఖ్య పెంచాం.

మేడిగడ్డ నిర్మాణం ఒక్కరి నిర్ణయం కాదు..

మేడిగడ్డ నిర్మాణానికి ముందు మంత్రులు అధికారులు అనేకసార్లు భేటీ అయ్యారు.

వ్యాప్కాన్స్ సంస్త నివేదికల ఆధారంగా మేడిగడ్డ అన్నారం సుందిళ్ల బ్యారేజీలు నిర్మించాం.

మేడిగడ్డ నిర్మించాలని రిటైర్డ్ ఇంజనీర్లు సైతం రిపోర్టులు ఇచ్చారు.

**కమిషన్**

అన్నారం సుందిళ్ళ లొకేషన్ మార్చడంపై ఏమైనా చర్యలు తీసుకున్నారా..?

**హరీశ్‌రావు**

లొకేషన్ మార్పు అంశం పూర్తిగా టెక్నికల్%ా% టెక్నికల్ రిపోర్టులు ఆధారంగా లొకేషన్స్ మారాయి.

బ్యారేజీలు, ప్రాజెక్టుల లొకేషన్స్ మారడం ఇప్పుడు కొత్తేమీ కాదు.

గతంలో నాగార్జున సాగర్, కాంతనపల్లి లాంటి ప్రాజెక్టులు లొకేషనులు మారాయి.

**కమిషన్**

ప్రాజెక్టుల లొకేషన్‌లు మార్చే అధికారం హై పవర్ కమిటీకి అధికారం ఉందా..?

**హరీశ్‌రావు**

అప్పటి ప్రభుత్వం హై పవర్ కమిటీకి అన్ని అధికారాలు ఇచ్చింది.

**కమిషన్**

కాళేశ్వరం కార్పొరేషన్ ఏర్పాటుకు కారణం ఏంటి..?

**హరీశ్‌రావు**

లోన్స్ కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేశాం.

**కమిషన్**

కార్పొరేషన్ ద్వారా తీసుకున్న లోన్స్ రీపేమెంట్స్ ఎలా చేయాలనుకున్నారు.?

**హరీశ్‌రావు**

నీళ్లను అమ్మి లోన్లను రీ పేమెంట్ చేయాలి అనుకున్నాము.

**కమిషన్**

కార్పొరేషన్ ద్వారా రెవెన్యూ జనరేట్ అయిందా? అయితే ఇంత చేశారు?

**హరీశ్‌రావు**

కోవిడ్ కారణంగా రెండు సంవత్సరాలు డిలే అయింది.

**కమిషన్**

నిర్మాణ సంస్థలకు సైట్ ఆలస్యంగా ఎందుకు ఇచ్చారు?

**హరీశ్‌రావు**

సాధారణంగా అప్పటి పరిస్థితులు ఆధారంగా సైట్స్ కొంత డిలే అవుతాయి.

**కమిషన్**

మేడిగడ్డ నుంచి మిడ్ మానేరుకు డైరెక్ట్‌గా నీళ్లు ఇవ్వొచ్చు ఎక్స్‌పర్ట్ కమిటీ చెప్పిందా..?

**హరీశ్‌రావు**

డైరెక్ట్ గా నీళ్లు ఇవ్వడానికి సాధ్యం కాదని ఎక్స్‌పర్ట్ కమిటీ చెప్పింది.

**కమిషన్**

కాళేశ్వరం ద్వారా ఎన్ని నీళ్లలో స్టోరేజీ చేశారు..?

**హరీశ్‌రావు**

రిజర్వాయర్ల ద్వారా 141 టిఎంసిల నీళ్లను స్టోరేజ్ చేసాం.

**కమిషన్**

బ్యారేజీలలో ఫుల్ లెవెల్ ట్యాంక్ వరకు నీళ్లను స్టోర్ చేశారా ?

**హరీశ్‌రావు**

టెక్నికల్ అంశాలు అధికారులు మాత్రమే చూసుకుంటారు.

**కమిషన్**

బ్యారేజీలలో నీళ్లను నింపమని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందా?

**హరీశ్‌రావు**

బ్యారేజీలలో నీళ్లను నింపమని ఎవరు ఆదేశించలేదు.

**కమిషన్**

# కాళేశ్వరం ఎప్పటికైనా తెలంగాణకు జీవధార : హరీశ్‌రావు



హైదరాబాద్ : కాళేశ్వరం ఎప్పటికైనా తెలంగాణకు జీవధార.. ఈ విషయం తెలంగాణ ప్రజలకు అర్థమైంది అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. కాళేశ్వరం కమిషన్ ముందు ఏదీ నోటి మాటగా చెప్పలేదు. అన్నీ సాక్ష్యాధారాలతో సహా సమర్పించడం జరిగిందని స్పష్టం చేశారు. క్యాబినెట్ నిర్ణయాలు, వాప్కోస్ రిపోర్టులు, సీడబ్ల్యూసీ లేఖలు అన్నీ సమర్పించడం జరిగిందని హరీశ్‌రావు తెలిపారు. కాళేశ్వరం కమిషన్ విచారణ ముగిసిన అనంతరం బీఆర్కే భవన్ వద్ద హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.

ఈ రోజు కాళేశ్వరం కమిషన్ విచారణలో భాగంగా పిలవడం జరిగింది. కమిషన్ అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పడం జరిగింది. ఆధారాలతో సమాధానాలను కమిషన్‌కు అందించడం జరిగింది. కమిషన్ విచారణకు హాజరై రాజకీయాలు మాట్లాడటం సరికాదు. రాజకీయాలు ఏమైనా ఉంటే రేపు మాట్లాడుకుందాం. లోపట ఒకటి చెప్పి బయట ఒకటి చెప్పడం తప్పు అవుతుందని హరీశ్‌రావు పేర్కొన్నారు.

**తమ్మిడిహట్టిపైనే చాలాసేపు డిస్కషన్**

మొట్టమొదలు తమ్మిడిహట్టి నుండి మేడిగడ్డకు బ్యారేజ్‌ను ఎందుకు మార్చారు అనేదానిపై చాలాసేపు డిస్కషన్ జరిగింది. దానికి నేను కొత్తగా ఏర్పడిన తెలంగాణ ప్రభుత్వం తమ్మిడిహట్టి దగ్గరే ప్రాజెక్టు కట్టడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేశాం. ఇరిగేషన్ మంత్రిగా రివ్యూ చేసినప్పుడు ప్రాణహిత ప్రాజెక్టు 7 ప్యాకేజీలు 27 భాగాలుగా టెండర్లను పిలిచింది గత కాంగ్రెస్ ప్రభుత్వం. తల పనులు స్టార్ట్ చేయకుండా తోక పనులను కాంగ్రెస్ ప్రభుత్వం తవ్వింది అని హరీశ్‌రావు తెలిపారు.

**152 మీటర్ల ఎత్తులో నిర్మాణానికి ఒప్పుకోమని చెప్పారు..**

మహారాష్ట్ర కాంగ్రెస్ ఇరిగేషన్ మంత్రి హసన్ ముష్రఫ్‌ను తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటైన నెలకే వెళ్లి కలవడం జరిగింది. తమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతి ఇవ్వండని అప్పటి మహారాష్ట్ర కాంగ్రెస్ మంత్రి హసన్ ముష్రఫ్‌ను కోరడం జరిగింది. ఇరిగేషన్ మంత్రిగా ఉన్నటువంటి హాసన్ ముష్రఫ్.. చాలా రోజులుగా ముంపు గ్రామాల ప్రజలు మా ప్రభుత్వంపై నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో మేము ప్రాజెక్టు 152 మీటర్ల ఎత్తులో నిర్మాణానికి ఒప్పుకోమని తేల్చి చెప్పారు. ఇదే విషయాన్ని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చౌహాన్ అప్పటి ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డిరికి ఈ ప్రాజెక్టు 152 మీటర్ల ఎత్తులో నిర్మించడానికి ఒప్పుకోమని తేల్చి చెప్పారని చెప్పడం జరిగింది. ఈ విషయాన్ని కూడా కమిషన్ దృష్టికి తీసుకు వెళ్ళామని హరీశ్‌రావు తెలిపారు.

**తమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి ఐదారు మీటింగ్స్**

మహారాష్ట్ర, తెలంగాణ మధ్య తమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి ఐదారు మీటింగ్స్ జరిగాయి. మహారాష్ట్రలో కాంగ్రెస్ ప్రభుత్వం పోయి బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నీటిపారుదల శాఖ మంత్రిని కలిసి మళ్లీ తమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించాలని, తెలంగాణకు నీటి అవసరం ఉందని కోరడం జరిగింది. స్వయంగా కేసీఆర్ మహారాష్ట్రకు వెళ్లి అప్పటి గవర్నర్ విద్యాసాగర్ సమక్షంలో బిజెపి ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌ను కలిశారు. ఏడేండ్లు మాకంటే ముందు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బిజెపి పార్టీ తరఫున ఈ ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకిస్తూ అనేక పోరాటాలు చేసింది తానేనని ఇప్పుడు ఆ ప్రాజెక్టుకు పర్మిషన్ ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వలేమని ఫడ్నవీస్ తేల్చి చెప్పారని హరీశ్‌రావు గుర్తు చేశారు.

**తమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం**

కేంద్రంలో కాంగ్రెస్, మహారాష్ట్రలో కాంగ్రెస్, ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ఏడు సంవత్సరాలు అధికారంలో ఉంటే ఒక్క అనుమతి కూడా సాధించలేదు. ఒక్క అంతర్ రాష్ట్ర ఒప్పందం చేసుకోలేదు. ఒక గుంట భూమిని కూడా సేకరించలేదు. తమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. తెలంగాణ ప్రాంతం నుంచి మంత్రులుగా ఉన్న కోమటిరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి పట్టించుకోలేదు. సెంట్రల్ వాటర్ కమిషన్ తమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత లేదు అని ప్రాజెక్టు నిర్మాణానికి ప్రత్యామ్నాయం చూసుకోవాలని లేఖ రాసింది. అదేవిధంగా తమ్మిడిహట్టి ప్రాజెక్టులో ప్రతిపాదించిన రిజర్వాయర్ల సామర్థ్యం కూడా సరిపోదని సామర్థ్యానికి సరిపోయే రిజర్వాయర్లను పెంచుకోవాలని ఉత్తరం రాసింది. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వ సంస్థ వ్యాప్కోస్‌ని బ్యారేజ్ నిర్మాణ స్థల ఎంపిక చేయాలని కేసీఆర్ కోరడం జరిగింది. కేంద్ర సంస్థ వాప్కోస్ లాడార్ సర్వే చేసి, ఎగ్జామిన్ చేసి మేడిగడ్డ వద్ద నీటి లభ్యత ఉంది అక్కడ ప్రాజెక్టు నిర్మాణం చేసుకోవచ్చని తెలిపింది. వాప్కోస్, సెంట్రల్ వాటర్ కమిషన్, ఇంజనీర్ల సూచన మేరకు మేడిగడ్డ వద్ద ప్రాజెక్ట్ నిర్మాణం జరిగింది అని హరీశ్‌రావు తెలిపారు.

**నీళ్లు లేనిచోట కాంగ్రెస్ ప్రాజెక్ట్ ప్రతిపాదిస్తే..**

కాంగ్రెస్ ప్రభుత్వం ఏడేండ్లుగా పొరుగు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించలేదు. అదేవిధంగా మహారాష్ట్రలో ముంపుకు గురవుతున్న చోట చాప్రాల్ వైల్డ్ లైఫ్ ఉంది. వైల్డ్ లైఫ్ అనుమతులు లభించాలంటే కనీసం 10 సంవత్సరాలు సుప్రీంకోర్టులో కొట్లాడాల్సి వస్తుంది. నీళ్లు లేనిచోట కాంగ్రెస్ ప్రాజెక్ట్ ప్రతిపాదిస్తే నీళ్లు ఉన్నచోట ప్రాజెక్టును బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదించడం జరిగింది. అన్ని రకాల ఆధారాలు మహారాష్ట్ర ముఖ్యమంత్రి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి రాసిన ఉత్తరాలు, జీవోలు అన్నీ కమిషన్‌కు సమర్పించడం జరిగింది అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# మంత్రి పదవి ఇవ్వడానికి ఇందూరు నేతలకు అర్హత లేదా ? : దినేష్ పటేల్ కులాచారి




నిజామాబాద్ (సందేశం టైమ్స్) : మంత్రి పదవి ఇవ్వడానికి ఇందూరు నేతలకు అర్హత లేదా అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి ప్రశ్నించారు. మంత్రివర్గ విస్తరణ లో నిజామాబాద్ జిల్లాకు కనీసం ఒక్క మంత్రి పదవి కూడా కేటాయించకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇది సాదా విషయమేం కాదన్నారు. సోమవారం నిజామాబాద్ బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి మాట్లాడుతూనిజామాబాదు జిల్లాకు చెందిన పీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ గౌడ్, మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని కూడా గౌరవించని కాంగ్రెస్, తన పార్టీ నేతల పట్లే చులకన చూపుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీకి జిల్లాల ప్రాతినిధ్యం పట్ల పట్టుదల లేదన్నారు. ఇది నైతికంగా, ప్రజాస్వామ్య పరంగా బాధాకరమన్నారు. నిజామాబాద్ సమస్యలు ఎవరికీ చెప్పుకోవాలి.. ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సుడిగాలి పర్యటన తప్ప అభివృద్ధిపై శ్రద్ధ లేదన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీకి సరైన బుద్ధి చెప్పాలన్నారు. రాష్టంలో బీసీలకు మేమే పెద్దపీఠ అని చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో 56శాతం ఉన్నా బీసీలకు మీ మంత్రి వర్గంలో ఎంత మందికి పదవులు ఇచ్చారో ప్రజలకు జవాబు చెప్పాలన్నారు. బీసీల ఓట్లు కావాలి.. కానీ బీసీలకు పదువులు ఇవ్వరా అని అన్నారు. బీసీలను విస్మరించిన కాంగ్రెస్ ను రాబోయే రోజుల్లో బొంద పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనకార్ లక్ష్మినారాయణ, న్యాలం రాజు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గోపిడి స్రవంతి రెడ్డి, ఉపాధ్యక్షులు నాగోల్ల లక్ష్మి నారాయణ, ఇంటలెక్చువల్ కన్వీనర్ డా:కొండా ఆశన్న, రూరల్ కన్వీనర్ పద్మ రెడ్డి, బీజేపీ జిల్లా నాయకులు నాగరాజ్, ఓం సింగ్, నాయిడి రాజన్న, యాదల నరేష్, అమందు విజయ్ కృష్ణ, చిరంజీవి, సందీప్ పాల్గొన్నారు.

# రాజన్న గోశాలలో గడ్డి స్కాం

- కోడెలకు గడ్డిపెట్టకుండా నెలకు 5లక్షల అవినీతి
- కడుపునిండా ఆహారం పెట్టలేని దుస్థితిలో ప్రభుత్వం
- కోడెల మృతిలో ప్రథమ ముద్దాయి మంత్రి కొండా సురేఖనే
- ఆమె నిర్వాకం వల్లే పంపిణీ ఆరు నెలల నుంచి నిలిచింది
- బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గం ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ధ్వజం
- తిప్పాపూర్‌లోని రాజన్న గోశాల పరిశీలన



వేములవాడ, (సందేశం టైమ్స్) : వేములవాడ రాజన్న ఆలయ గోశాలలో గడ్డి స్కాం జరిగిందని, కోడెలకు గడ్డి వేయకుండా ప్రతి నెలా దాదాపు 5 లక్షల అవినీతికి పాల్పడుతున్నారని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ఆరోపించారు. కోడెలకు కనీసం కడుపునిండా తిండి పెట్టని దుస్థితిలో ప్రభుత్వం ఉందని విమర్శించారు. రాజన్న భక్తుల విశ్వాసానికి, నమ్మకానికి ప్రతీకైన కోడెలు మృత్యువాత పడడంలో ప్రథమ ముద్దాయి మంత్రి సురేఖనేనని తీవ్ర ఆరోపణలు చేశారు. రాజన్న ఆలయానికి సంబంధించిన తిప్పాపూర్ గోశాలలో అధికారిక లెకల ప్రకారం 33 కోడెలు మృతిచెందగా, ఆయన నాయకులతో కలిసి పరిశీలించారు. కోడెల పరిస్థితిని చూసి చలించిపోయారు. అందుకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖనే కారణమని తీవ్ర విమర్శలు చేశారు.కలెక్టర్ కన్వీనర్‌గా ఉండి ఒక్కో రైతుకు రెండు కోడెలను మాత్రమే ఇవ్వాలన్న నిబంధనలను మంత్రి తుంగలో తొక్కారని మండిపడ్డారు. తన సిఫారసు లేఖ ద్వారా అధికారులపై ఒత్తిడి తెచ్చి గీసుకొండకు చెందిన రాంబాబుకు అక్రమ పద్ధతిలో 60 కోడెలను ఇచ్చింది నిజం కాదా అని ప్రశ్నించారు. అందులో 49 కోడెలు మాయం కావడంతో గీసుకొండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదై రాంబాబు జైలుకు వెళ్లిన విషయంపై మీడియాలో కథనాలు వచ్చాయని చెప్పారు. దాంతో డిసెంబర్ నుంచి కోడెల పంపిణీ ప్రక్రియ నిలిచిపోయిందని, రాజన్న గోశాలలో 500 ఉండాల్సిన చోట 1300 ఉన్నాయన్నారు. ఇకడ అసలైన రాజకీయం ఎవరు చేస్తున్నారో ఆలోచించాలన్నారు.స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అవగాహన లేకుండా కోడెలు లంపి స్కిన్‌తో చనిపోతున్నాయని చెప్పడం ఆయనకున్న శ్రద్ధ ఏమిటో తెలిసిపోయిందని ఎద్దేవా చేశారు. సాక్షాత్తూ పశు వైద్యాధికారులే సరైన పోషకాహారం అందక చనిపోతున్నాయని వెల్లడిస్తున్నా కనీస వివరాలు తెలుసుకోకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. అసలు గోశాలలో కోడెలకు గడ్డి వేయకుండా అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. రోజుకు 10 టన్నుల చొప్పున గడ్డిని అందించేందుకు టెండర్ ప్రక్రియ నిర్వహించారని, పది టన్నుల గడ్డిని అందించాలనే కనీసం 25 ఎకరాల్లో పచ్చి గడ్డి వేసి ఉండాలని చెప్పారు. కానీ, సదరు కాంట్రాక్టర్‌కు 8 ఎకరాల వరకే ఉన్నట్టు తనకు సమాచారం ఉందని, అందులో ప్రతిరోజూ కేవలం రెండు టన్నులు మాత్రమే పచ్చి గడ్డి తెస్తున్నారని, మిగతా ఎనిమిది టన్నులు కాగితాల్లోనే చూపుతున్నారని ఆరోపించారు.రోజుకు 16 వేల చొప్పున నెలకు దాదాపు 5 లక్షల వరకు స్కాం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా కోడెల మృతి, గడ్డి స్కాంపై విచారణ జరపించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన వెంట పార్టీ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, న్యాలకొండ రాఘవరెడ్డి, మాజీ జడ్పీటీసీ మ్యాకల రవి, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి కందుల క్రాంతి కుమార్, పార్టీ రూరల్ మండల అధ్యక్షుడు గోసుల రవి, నాయకులు పొలాస నరేందర్, రామతీర్థపు రాజు, జోగిని శంకర్, నరాల శేఖర్, నిమ్మశెట్టి విజయ్, ముద్రకోల వెంకటేశం, బూరబాబు, వెంగళ శ్రీకాంత్ గౌడ్, వెంకట్ రెడ్డి, మల్లేశం, సత్యనారాయణ రెడ్డి, తదితరులు ఉన్నారు.

# పునర్విభజన.. గందరగోళం

## డివిజన్లలో కలవని మ్యాపింగ్.. ఇంటి నంబర్లు

## అభ్యంతరాల పరిశీలనలో అధికారులు



కార్పొరేషన్, (సందేశం టైమ్స్): కరీంనగర్ నగరపాలక సంస్థలో చేపట్టిన డివిజన్ల పునర్విభజన గందరగోళంగా మారింది. ముసాయిదాలో కొన్ని డివిజన్లల్లో ఓట్లు ఎక్కువగా, మరికొన్ని డివిజన్లల్లో తక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. నగరపాలక టౌన్ ప్లానింగ్ అధికారులు ఇచ్చిన మ్యాపింగ్ సరిహద్దులకు, రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఇంటి నంబర్ల సరిహద్దులకు ఎక్కడా పొంతన లేకపోవడం పెద్ద సమస్యగా మారిపోయింది. ఏ డివిజన్ పరిధి ఎక్కడి వరకు ఉంటుందో..? తెలియని పరిస్థితి నెలకొన్నది. అయితే ఇరు విభాగాల మధ్య సమన్వయం లేకపోవడమే ఇందుకు కారణంగా కనిపిస్తున్నది. అనేక డివిజన్లల్లో ఇంటి నంబర్ల కేటాయింపు గజిబిజీగా ఉండడంతో సరిహద్దులు నిర్ణయించడంలో తీవ్ర సమస్యలు వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు.ప్రస్తుతం డివిజన్ల పునర్విభజనను రెవెన్యూ డివిజన్ల ఆధారంగా చేసుకొని ముసాయిదాను తయారు చేశారు. అయితే కొన్ని రెవెన్యూ డివిజన్ల ఇంటి నంబర్ సీరిస్‌ల పక్కనే మరో ఇంటి నంబర్ సిరీస్‌లు రావడం, ఒకే ఇంటి నంబర్‌పై అనేక బై నంబర్స్‌తో ఇండ్లు ఉండడంతో ఆయాచోట్ల ఓటర్ల సంఖ్య భారీగా పెరిగినట్లు తెలుస్తోంది. దీనిపై అన్ని పార్టీల నేతల నుంచి తీవ్ర స్థాయిలో అభ్యంతరాలు వస్తుండగా, నగరపాలక అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. అయితే ఇంటి నంబర్ల తీరు అధికారులకు సరికొత్త సవాళ్లను తీసుకువస్తున్నట్లు సమాచారం.పలు డివిజన్లల్లో ఒకే ఇంటి నంబర్‌పై పది, పదిహేను ఇళ్ల బై నంబర్స్ ఉండడం వాటిల్లో పెద్ద సంఖ్యలోనే ఓటర్లు ఉండడంతో ఎలా సర్దుబాటు చేయాలన్న విషయంలో మల్లగుల్లాలు పడుతున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా డివిజన్ల పునర్విభజన ప్రక్రియలో తుది జాబితా నాటికి భారీగా మార్పులు చేర్పులు కనిపించే అవకాశాలున్నాయి.

# కనిగిరి గుట్టల్లో భద్రాద్రి ఎస్పీ..

## గుట్టల అందాలు, ప్రకృతి రమణీయత పట్ల పరవశం



చంద్రుగొండ,(సందేశం టైమ్స్): మండలంలోని బెండాలపాడు గ్రామ శివారులో ఉన్న కనిగిరి (కనకాద్రి) గుట్టల అటవీ ప్రాంతాన్ని భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు ఆదివారం పరిశీలించారు. తొలుత బెండాలపాడులోని బ్యాంబూ క్లస్టర్ (వెదురు ఉత్పత్తుల తయారీ కేంద్రాన్ని) సందర్శించి ఉత్పత్తుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కనకాద్రి గుట్టలు ఎక్కారు. వాటి అందాలను, అక్కడి నుంచి కన్పించే అటవీ ప్రాంత రమణీయతను చూసి పరవశించిపోయారు.కనిగిరి గుట్టలను మంచి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందేందుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయంటూ కితాబిచ్చారు. కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, సీఐలు రాయల వెంకటేశ్వర్లు, ఇంద్రసేనారెడ్డి, ఎస్సైలు, చంద్రుగొండ అటవీశాఖ రేంజర్ ఎల్లయ్య, ఫారెస్టు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బడి బస్సు భద్రమేనా..

## యాదాద్రి భువనగిరి జిల్లాలో 378 బస్సులకు 229 కి పరీక్షలు పూర్తి

### కండిషన్‌లో లేని వాహనాలు వెనక్కి పంపాలని నిర్ణయం ఫిట్‌నెస్ పరీక్షలు లేకుండానే


### నడిపిస్తున్న బస్సులు విద్యార్థుల సంరక్షణ బాధ్యత పాఠశాలల యాజమాన్యాలదే..




(సందేశం టైమ్స్): ఈ ఏడాది విద్యా సంవత్సర ప్రారంభ సమయం దగ్గర పడుతున్నది. ఈలోగా విద్యార్థుల రవాణాకు ఉపయోగించే ప్రైవేట్ పాఠశాలల బస్సులకు తప్పనిసరిగా ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించి, ఆర్టీఏ అధికారుల నుంచి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాలి. ప్రస్తుత విద్యా సంవత్సరానికి గతనెల 15వ తేదీతో బడి బస్సుల ఫిట్‌నెస్ సర్టిఫికెట్ గడువు ముగిసింది. గడువు దాటినా జిల్లాలో సగం పాఠశాలల యాజమాన్యాలు ఇంకా బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించలేదు. ఈ మేరకు జిల్లాలోని ఆర్టీఏ కార్యాలయంలో పరీక్షలు కొనసాగుతున్నా యాజమాన్యాలు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. మోత్కూరు, జూన్ 8: ఆర్టీఏ అధికారులు సంబంధిత యాజమాన్యాలతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. గత విద్యా సంవత్సరం యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించకుండానే కొన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు బస్సులు నడిపాయి. ఈ సారైనా అధికారుల కఠినంగా వ్యవహరిస్తేనే పూర్తిస్థాయిలో పరీక్షలు చేయించుకునే అవకాశం ఉన్నది. జిల్లాలో 378 బస్సులు ఉండగా ఇందులో 229 బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ పరీక్షలు గురువారం నాటికి పూర్తి చేసుకోగా ఇంకా 149బస్సులు పరీక్షలు చేసుకోవాల్సి ఉన్నది. ప్రైవేట్ విద్యా సంస్థల బస్సుల ఫిట్‌నెస్ విషయంలో కొందరు అధికారులు ఉదాసీనంగా, ఏజెంట్లు చెప్పినట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.150 బస్సులు.. ఫిట్‌నెస్ పరీక్షలకు దూరం..గతేడాదిలో జిల్లాలో దాదాపు 150 బస్సులు ఫిట్‌నెస్ పరీక్షలు చేసుకోకుండానే విద్యార్థులను తరలించారని తెలుస్తున్నది. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి అర్హత పత్రాలు తీసుకోవాల్సిన కొన్ని యాజమాన్యాలు వాహనాల రిపేరు ఇతర కారణాలతో ఫిట్‌నెస్ పరీక్షలు చేయించలేదు. విద్యా సంస్థల బస్సులన్నీ నిబంధనల ప్రకారం వసతులు కల్పించి ఫిట్‌నెస్ పరీక్షలు చేయించి విద్యార్థుల సంరక్షణ బాధ్యత తమదేనంటూ పాఠశాలల యాజమాన్యాలు రవాణా శాఖకు హామీ పత్రం సమర్పించాలి.


# లక్ష్యం చేరని ధాన్యం కొనుగోళ్లు..

## ఇప్పటివరకు కొన్నది 3.10 లక్షల మెట్రిక్ టన్నులే



మెదక్, (సందేశం టైమ్స్) : ఈ యాసంగి సీజన్‌లో ధాన్యం సేకరణకు 498 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో 418 కేంద్రాల ద్వారా 2,49,213 మెట్రిక్ టన్నుల దొడ్డురకం ధాన్యాన్ని సేకరించగా, 80 కేంద్రాల ద్వారా 59,934 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేశారు. మొత్తం రూ.717 కోట్ల విలువైన ధాన్యాన్ని సేకరించగా రైతులకు రూ.600 కోట్లు చెల్లించారు. సన్నధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 చొప్పున 14,290 మంది రైతులకు రూ.29.97 కోట్ల బోనస్ చెల్లించారు. ఇప్పటి వరకు అన్ని కేంద్రాల్లో సేకరణ ముగియగా 75,371 మంది రైతులు తమ ధాన్యాన్ని విక్రయించారు. ఈ సీజన్‌లో మే నెలలో కురిసిన అకాల వర్షాల వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్ని మండలాల్లోని సెంటర్ల వద్ద ధాన్యం మొలకలు వచ్చాయి. దీంతో రైతులు చేసేదేమీలేక ధాన్యం కొనుగోళ్లు కేంద్రాల్లోనే వడ్లను ఆరబెట్టి తూకం వేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద అధికారులు కనీసం టార్పాలిన్లు అందుబాటులో ఉంచలేదని పలువురు రైతులు ఆరోపించారు.

# ప్రగతి చక్రానికి బ్రేక్‌లు




నారాయణఖేడ్, (సందేశం టైమ్స్) : వెనుకబడిన ప్రాంతంగా ఉన్న నారాయణఖేడ్ నియోజకవర్గం పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి పరంగా పరుగులు పెట్టిందనే చెప్పాలి. దశాబ్దాల కలలను సాకారం చేసే దిశగా అనేక అభివృద్ధి పనులకు బీఆర్ఎస్ ప్రభుత్వం కార్యరూపం ఇచ్చింది. తలాపునే మంజీరా నది పారుతున్నా సాగునీటికి నోచుకోని పరిస్థితుల్లో వర్షాధార పంటలను సాగుచేస్తూ అతివృష్టి, అనావృష్టి బారినపడి అనేక ఒడిదుడుకుల మధ్య వ్యవసాయం చేస్తున్నారు ఈ ప్రాంత రైతులు.

ఇక్కడి రైతుల కష్టాలకు చరమగీతం పాడుతూ నారాయణఖేడ్ నియోజకవర్గంలోని 1.65 లక్షల ఎకరాలకు సాగునీరందించే బృహత్తరమైన బసవేశ్వర ఎత్తిపోతల పథకానికి నాంది పలికింది కేసీఆర్ ప్రభుత్వం. నీటి సమస్య మొదలుకొని ప్రజల అవసరాలను గుర్తించి దశల వారీగా చేపట్టిన అభివృద్ధి నియోజకవర్గ రూపురేఖలు మార్చేసింది అనడంలో అతిశయోక్తి లేదు. ఇదంతా పదేండ్ల బీఆర్ఎస్ హయాంలో గతించిపోయిన ప్రగతి శకం.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిన్నర సమయంలో కాలచక్రం ముందుకు సాగింది తప్ప ప్రగతి చక్రం మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. ఎన్నికల్లో గట్టెక్కడమే లక్ష్యంగా నారాయణఖేడ్ నియోజకవర్గ అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ నాయకులు ఊదరగొట్టిన ఉపన్యాసాలు ఉత్త ముచ్చట్లుగానే మిగిలిపోయాయి.అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన పనులకే మోక్షం లభించని నేపథ్యంలో ఇక ప్రస్తుత ప్రభుత్వం మంజూరు చేసి చేపట్టే పనులు దేవుడెరుగు.ఎన్నో ఆకాంక్షలతో కాంగ్రెస్‌కు ఓటేసిన ప్రజల పరిస్థితి ఎడారిలో నీటిబొట్టు కోసం వెతికిన తీరుగా మారింది. ఇక సంక్షేమ పథకాల అమలు గురించి వేరే చెప్పనక్కర్లేదు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పరిస్థితి ఇక్కడా నెలకొని ఉన్నది.

# వైభవంగా అష్టోత్తర శతఘటాభిషేకం



యాదగిరిగుట్ట, (సందేశం టైమ్స్) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంతోపాటు అనుబంధ పాతగుట్ట(పూర్వగిరి) ఆలయంలో స్వాతీ నక్షత్ర పూజలు ఘనంగా జరిగాయి. స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతీ నక్షత్రం సందర్భంగా వైభవంగా అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించారు. ప్రధానాలయ ముఖమండపంలో 108 కలశాలు ఏర్పాటు చేసి గంగాది సప్తనదీ జలాలు, మామిడి, తమలపాకులు, దర్భలు, పూలమాలలు, కొబ్బరికాయలతో అలంకరించారు. పంచామృతాలతోపాటు సుగంధ ద్రవ్యాలతో స్వామివారిని అభిషేకించారు. ఆయా దేవతల మూలమంత్ర పఠనాలతో హోమ పూజలు నిర్వహించారు. ప్రధానాలయంలోని స్వయంభూ పంచనారసింహస్వామి, సువర్ణప్రతిష్ఠ అలంకారమూర్తులను వేదమంత్రాలతో అష్టోత్తర శతఘటాభిషేక పూజలు నిర్వహించి సువర్ణపుష్పాలతో అర్చించారు.సాయంత్రం జన్మనక్షత్రం స్వాతి సందర్భంగా స్వామివారిని దివ్యమనోహరంగా అలంకరించి పూజలు జరిపారు. తెల్లవారుజాము నుంచే భక్తులు గిరిప్రదక్షిణలు చేసి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. గిరిప్రదక్షిణలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. స్వామివారి ఆలయంలో భక్తుల కోలాహలం నెలకొన్నది. వేసవి సెలవులు ముగుస్తున్న నేపథ్యంలో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. మాఢవీధులు, క్యూ కాంప్లెక్స్, క్యూలు, బస్టాండ్ ప్రాంతం భక్తులతో నిండిపోయింది. కొండపైన, కింద పార్కింగ్‌లో వాహనాలు నిండిపోయాయి. సీసీ కెమెరాల పనితీరు ఆలయ ఈవో వెంకట్రావ్ పరిశీలించారు. ఆలయ పరిసరాల్లో సీసీ కెమెరాలను మానిటరింగ్ సిస్టంలో పరిశీలించి ఆలయ, పోలీసులకు సూచనలు చేశారు.

# ఉగ్రవాదం అంతమే లక్ష్యం : ఎమ్మెల్సీ



పామిడిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు

పామిడి,(సందేశం టైమ్స్) : దేశంలో ఉగ్రవాదాన్ని అంతం చే యడమే బీజేపీ పంతమని ఎమ్మెల్సీ సోము వీర్రాజు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆపరేషన సిం దూర్ పై చాయ్ పే చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ మా ట్లాడుతూ... ఆపరేషన సిందూర్ ద్వారా భారత సత్తా ఏంటో ప్రపంచానికి ప్రధాని మోడీ చాటిచెప్పారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్, యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా వం శీకృష్ణ, యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు రాజశేఖర్ గౌడ్, మండ ల అధ్యక్షుడు అంజినాయక్, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డి, గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన ప్రభాకర్ చౌదరి పాల్గొన్నారు.

# కసాపురంలో కంపు కంపు

గుంతకల్లుటౌన, (సందేశం టైమ్స్): రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం పరిస్థితి అధికారుల నిర్లక్ష్యం వల్ల పేరు గొప్ప.. ఊరు దిబ్బలా తయారైంది. కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయానికి వెళ్లాలంటే మురుగు నీటిని దాటుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామంలో ప్రధాన రోడ్లపై మరుగు నీరు ప్రవహిస్తుంది. అయినా ప్రజా ప్రతినిధులు, పం చాయతీ అధికారులు చోద్యం చేస్తున్నారు.



# మెప్మాకు 9 స్కోచ్ అవార్డులు

## సెప్టెంబరు 20న ఢిల్లీలో ప్రదానం

అమరావతి, (సందేశం టైమ్స్): ఆంధ్రప్రదేశ్ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) 9 స్కోచ్ అవార్డులను దక్కించుకుంది. వివిధ కేటగిరీల్లో నామినేట్ అయిన 14 ప్రాజెక్టులకు గాను 9 ప్రాజెక్టులకు ప్లాటినం అవార్డులు ప్రకటించారు. దుర్భర జీవితాన్ని గడిపేవారిని ఆర్థికంగా పైకి తీసుకొచ్చే నివాస, బ్యాంక్ లింకేజీ, లైవ్‌లీ హుడ్ ట్రాకర్, ఈ-కామర్స్ అమ్మకాలు, నైపుణ్యాభివృద్ధి, జీవనోపాధి యూనిట్లు, ప్రేరణ, సఖి, వీధి వ్యాపారుల మేనేజ్‌మెంట్ తదితర పథకాలకు అవార్డులు అందజేయనున్నారు. సెప్టెంబరు 20న ఢిల్లీలో స్కోచ్ ప్లాటినం అవార్డులు ప్రదానం చేయనున్నారు. మెప్మా తరఫున మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్‌భరత్ అవార్డులను అందుకోనున్నారు. ఈ అవార్డులు దక్కించుకునేందుకు కృషి చేసిన అధికారులు, సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు.

# అనంతపురం విద్యార్థిని తన్మయి మర్డర్ మిస్టరీ

ఇంటర్నెట్ డెస్క్:జూన్ 9(హేలాపురి న్యూస్) ఇంటర్ విద్యార్థిని తన్మయి మర్డర్ మిస్టరీ అనంతపురంలో సంచలనం రేకెత్తించింది. ఈ కేసుకు సంబంధించి సిఐ రాజేంద్రనాథ్ యాదవ్ పలు వివరాలు అందించారు. విద్యార్థిని కనపడటం లేదని బుధవారం 4వ తేదీన ఆమె తల్లితండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. అదే రోజు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని అన్నారు. విద్యార్థిని మంగళవారం (ఈనెల 3న) ఒక యువకుడితో రాత్రి 9 గంటల సమయంలో బైక్ పై వెళ్లినట్లు ఆధారాలు సేకరించామని చెప్పారు. అనుమానితున్ని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని, విద్యార్థినికి ముగ్గురు యువకులతో పరిచయం ఉన్నట్లు సమాచారం ఉందని సీఐ చెప్పారు. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థినిని మంగళవారం రాత్రి కూడేరు లిమిట్స్‌లోని మణిపాల్




స్కూల్ వెనుక బీర్ బాటిల్‌తో తల పగలగొట్టి హత్య చేశారని సీఐ వెల్లడించారు. విద్యార్థిని హత్య ఒకరే చేశారా లేక ఎంతమంది ఉన్నారన్నది విచారణ పూర్తి అయిన తరువాత తెలుస్తుందని సీఐ చెప్పారు.


# నష్టాల బాటలో బూడిద గుమ్మడి రైతులు

గాండ్లపెంట(సందేశం టైమ్స్) : మండల వ్యాప్తంగా పలువురు రైతులు బూడిద గుమ్మడి పంట సాగుచేశారు. అయితే ఈ యేడాది ధరలు లేకపోవడంతో తీవ్రంగా నష్ట పోయామని రైతులు వాపోతున్నారు. రబీలో వ్యవసాయ బోర్ల కింద తీగజాతి బూడిదగుమ్మడిని సాగుచేశారు. గతయేడాది మంచి లాభాలు రావడంతో, ఈ యేడాది కూడా ఆశించిన ధరలు ఉంటాయని ఎంతో



భావించారు. దీంతో రైతులు మండలంలో దాదాపు 400 ఎకరాలకుపైగా బూడిద గుమ్మడి సాగుచేశారు. పంట సాగు కోసం ఎకరాకు రూ. 30వేలు ఖర్చు చేసినట్లు రైతులు తెలుపుతున్నారు. అయితే ఈ యేడాది ధరలు పూర్తిగా పతనం కావడంతో రైతులు కాయలను పొలాల్లోనే వదిలేశారు. ప్రస్తుత ధరలతో పెట్టబడులు కూడా రాకపోవడంతో నష్టాల ఊబిలో కూరుకుపోయామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బూడిదగుమ్మడి పంట సాగుచేసి, నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

# అంధకారంలో వెలిచలమల క్రాస్



నంబులపూలకుంట,(సందేశం టైమ్స్) : మండలపరిధిలోని వెలి చలమల క్రాస్ అంధకా రంలో మగ్గుతున్నట్లు స్థానికులు వా పోతు న్నారు. విద్యుత స్తంభా లకు ఏర్పాటుచేసిన బ ల్బులు వెలగడం లేదం టున్నారు. దీంతో రాత్రిళ్లు బయటకు రావాలంటే భ యపడుతున్నట్లు ఆం దోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో విష పురుగుల సంచారం ఎక్కువగా ఉందని భయాందోళన చెందుతున్నామన్నారు. ప్రస్తుతం చోరీలు కూడా అక్కడక్కడ జరుగుతున్నాయని, ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

# సోలార్ బాధితులకు త్వరలో పరిహారం

## గుండ్లచెరువులో పర్యటిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

గాలివీడు,(సందేశం టైమ్స్) : తూముకుంట పంచాయతీ ప్రకాశనగర్ కాలనీ సమీపంలో ఏర్పాటు చేయనున్న నూతన సోలార్ పవర్ ప్లాంట్‌కు భూములు కోల్పోతున్న రైతులకు త్వరలో నష్టపరిహారం అందజేయనున్నట్లు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆ యన గుండ్లచెరువుకు చెందిన టీడీపీ నాయకుడు ఉదయ్‌కుమార్ ఇచ్చిన విందులో పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ 100 మెగావాట్లతో సోలార్ విద్యుత పవర్ ప్లాంట్‌ను తూముకుంట పంచాతీలో ఏర్పాటు చేయనున్నారని, ఇందులో 64 ఎకరాలు డీకేటీ భూమి, 30 ఎకరాలు సాగుభూమి, 30 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందన్నారు. గతంలో డీకేటీ భూమికి రెండు లక్షలు ఇచ్చారని, కానీ ఏడాది ఎక్కువ మొత్తంలో ఇవ్వడానికి ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు. అలాగే ఎలాం టి ఆధారాలు లేకుండా



అనుభవంలో గల భూమికి ఎకరాకు రూ.లక్ష ఇప్పించడానికి కృషి చేస్తానని రైతులకు మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.




- టికెట్స్.. పూజల రూపంలో అక్రమాలు
- రుద్రాక్ష పేరుతోనూ దోచేస్తున్న వైనం
- మాయమైన రెండు కిలోల వెండి
- ఇద్దరు ఉద్యోగులు, ఓ మండల నాయకుడి దందా
- నెలకు రూ.లక్షల్లో వసూళ్లు
- దుకాణాల నుంచి నెలవారీ మాముళ్లు

నంద్యాల,(సందేశం టైమ్స్) : పవిత్ర పుణ్యక్షేత్రమైన మహానంది క్షేత్రంలో భక్తులు నిత్యం దోపిడీకి గురి అవుతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. టికెట్స్, పూజలు, భక్తులిచ్చే బహూకరణలు వరకు ఇలా. ఎక్కడ పడితే అక్కడ అందిన కాటికి దోచేడమే లక్ష్యంగా అక్కడ కొందరు ఉద్యోగులు ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. అధికారులతో పాటు ఓ మండల నాయకుడు కలిసి తమదైన శైలిలో నెలవారి అక్రమ వసూళ్లకు తెరలేపి నెలకు లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారని సమాచారం. వీరితో పాటు అక్కడ పనిచేసే బావ బామ్మర్ధులు సైతం రుద్రాక్షల పేరుతో భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. పైగా అక్కడ జరిగే వ్యవహారంపై ఎవరైనా ప్రశ్నించినా.. ఆరా తీసినా వెంటనే సంబంధిత ప్రజాప్రతినిధి పేరు అడ్డుగా వాడుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు. మొత్తంగా మహానందీ క్షేత్రంలో జరిగే పలు వ్యవహారాలపై భక్తులతో పాటు ప్రజల్లో పలు అనుమానాలకు తావిస్తోంది. ఇదే క్రమంలో దేవుడికే శఠగోపం పెట్టారనే ప్రచారం జోరందుకుంది. ఫారెన్‌కు చెందిన రెండు కేజీల వెండి మాయం కావడమే ఇందుకు నిదర్శనం.

**తమదైన శైలిలో చేతివాటం..**

మహానందిలో భక్తులు తాకిడి ఎక్కువ. ఇదే అదనుగా భావించిన కొందరు ఉద్యోగులు సైతం తమదైన శైలిలో చేతివాటం ప్రదర్శించి సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. ఉద్యోగుల్లో కీలక అధికారి కిందిస్థాయిలో పనిచేస్తున్న ఓ అధికారితో పాటు.. అర్చకుల్లో బావ బామ్మర్దులు కలిసి పలు రూపాల్లో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఒకే టికెట్‌పై ఎక్కువ మంది భక్తులు పంపి దర్శనాలు చేయిస్తున్నారని సమాచారం. ఇదీ చాలదన్నట్లుగా.. రుద్రాక్ష పూజల పేరుతో భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నారని సమాచారం. భక్తుల ఏదైనా సమస్యతో వస్తే.. ఆయా భక్తుల సమస్యల బట్టి రూ.500 నుంచి రూ.2000 వరకు వసూలు చేస్తారని తెలిసింది. ఈరూపంలోనే రోజుకు సుమారు రూ.10వేలకు పైగానే వస్తుందని సమాచారం. ఈలెక్కన నెలకు లక్షల్లోనే వారి జేబుల్లోకి వెళ్తున్న ట్లైంది. కార్తీక మాసంలో అడ్డదారిలో దర్శనాలు చేయించి ఉద్యోగులు రూ. లక్షల్లో సొమ్ముచేసు కున్నారనే విమర్శలు లేకపోలేదు. అర్చకులను ప్రతి మూడు నెలలకు ఒకసారి విభాగాలను మార్చాల్సి ఉన్నా ఆదాయం వచ్చే విభాగాల్లో కొందర్ని అక్కడే నెలల తరబడి కొనసాగిస్తున్నారని సమాచారం. అలాగే ఓ ఇన్‌స్పెక్టర్ (ఆలయంలో పనిచేసే అధికారి బంధువు) పెద్దఎత్తున అవినీతి పాల్పడుతున్నట్లు సమాచారం. మహానంది క్షేత్రంలోని వివిధ ఆలయాలను అక్రమంగా వసూలు చేస్తున్నట్లు తెలిసింది. సిబ్బంది పట్ల కూడా దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు సమాచారం. భక్తులు స్వామికి ఏదో రకమైన కాను కలు ఇస్తుంటారు. కానుకలు ఇచ్చిన వెంటనే తగిన రసీదు కూడా ఇవ్వాలి. ఫారెన్‌కు చెందిన ఇద్దరు(దంపతులు) 2020 సెప్టెం బరు నెలలో స్థానికులు ఇద్దరి సహకారంతో వచ్చి స్వామివారిని దర్శించు కున్నా రు. ఆతర్వాత స్వామివారికి రెండు కేజీల వెండి(నాలుగు బిస్కెట్‌లు) కానుకగా అందజేశారు.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006